ఎమ్మెల్యే పద్మారావును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు తలసాని, శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ, ఎంపీ వద్దిరాజు

పద్మారావుకు ప్రముఖుల పరామర్శ

ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న కేటీఆర్, హరీశ్‌రావు, కవిత తదితరులు

సికింద్రాబాద్, జనవరి 22 : డెహ్రాడూన్ పర్యటనలో గుండెపోటుకు గురై చికిత్స అనంతరం నగరానికి చేరుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ నేతలు బుధవారం పరామర్శించారు. మోండా మార్కెట్ టకారాబస్తీలోని ఆయన స్వగృహంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్‌కుమార్, సలీం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీశ్‌రావు, కవిత తదితరులు పద్మారావు ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని పద్మారావుకు సూచించారు. పద్మారావు త్వరగా కోలుకొని తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ యువనేత, పద్మారావు తనయుడు రామేశ్వర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. పద్మారావుగౌడ్ ఆరోగ్యం మెరుగుపడిందని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వైద్యుల సూచన మేరకు కొన్నిరోజుల విశ్రాంతి తరువాత తిరిగి అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

పద్మారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాగంటి

నేను బాగానే ఉన్నా

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జనవరి 22 : 'నేను బాగానే ఉన్నాను.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యరీత్యా డాక్టర్ల సూచన మేరకు తనను కలిసేందుకు ఎవరూ రావొద్దని, వారం, పది రోజుల్లో తానే ప్రజల్లోకి వస్తానని తెలిపారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వేద ఆశీర్వదం అందిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరిలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేతలు క్యామ మల్లేశ్, కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు

ప్రజాధనం లూటీకి కాంగ్రెస్ సర్కార్ ప్లాన్!

- ఢిల్లీకి కప్పం కట్టేందుకే కుయుక్తులు
- మల్లన్నసాగర్‌తో మూసీ అనుసంధానమా?
- కేసీఆర్ హయాంలోనే మూసీ పునరుజ్జీవం
- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ సమాధానం చెప్పాలి
- పాలాలకు నీళ్లివ్వకుండా రైతులపై సర్కార్ పగ
- పథకాలు రాకుంటే ఎక్కడికక్కడ నిలదీయండి
- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

యాదాద్రి భువనగిరి, జనవరి 22 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన పేరుతో చేపట్టే ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఏటీఎంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నదని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. మూసీ ప్రాజెక్టు పేరిట ధనాన్ని దోచి, ఢిల్లీకి కప్పం కట్టేందుకు కుయుక్తులు పన్నుతుందని ధ్వజమెత్తారు. మూసీ పేరుతో కోట్ల ప్రజాధనం లూటీ చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ సమీపంలో ఉన్న కొండపోచమ్మ సాగర్‌ను వదిలి, దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసీ-గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం ఏమిటని ప్రశ్నించారు. కేవలం కాంట్రాక్టర్ల కోసమే ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని విమర్శించారు. అందుకే అనుసంధాన ప్రాజెక్టు వ్యయం రూ.7,500 కోట్లకు పెంచారని తెలిపారు. దీనిపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం ఆమె యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ చేశారు. కొండపై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భువనగిరి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే మూసీ ప్రక్షాళన మొదలైందని, మూసీని గోదావరితో అనుసంధానం చేయాలని ఆనాడే భావించామని చెప్పారు. కేసీఆర్ హయాంలో 36 నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన అంటూ పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను పంపిస్తున్నదని మండిపడ్డారు.

నాగార్జున సాగర్‌కు అన్యాయం

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు అన్యాయం జరుగుతున్నదని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తంచేశారు. సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పజెప్పారని, మన ప్రాజెక్టును మన కంట్రోల్‌లోకి తీసుకోవాలని కోరారు. సాగర్ నుంచి నీళ్లివ్వకుండా రైతులపై పాలకులు పగ తీర్చుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిలో వాటాను కాపాడలేకపోయిందని తెలిపారు. ట్రిబ్యునల్‌లో మన వాదనలను బలంగా వినిపించాలని డిమాండ్ చేశారు. యాసంగిలో ఎస్సారెస్పీ నీళ్లివ్వకుండా పంటలను ఎడబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించామని, జీరో ఫ్లోరైడ్‌గా మార్చామని, ఇదే విషయం సాక్షాత్తు పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారని, ఆయన అన్న సంక్రాంతి కూడా దాటిపోయిందని దుయ్యబట్టారు.

పథకాలు అందకుంటే నిలదీయండి

గ్రామసభల అనంతరం అర్హులకు నాలుగు పథకాలు అందకుంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ప్రజాపాలన, అభయహస్తం, కులగణన పేరుతో ఇప్పటికే పలు దఫాలుగా వివరాలు తీసుకున్నారని, మళ్లీ గ్రామసభల పేరుతో డ్రామాలు ఎందుకని ఆమె ప్రశ్నించారు. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బీఆర్ఎస్ పార్టీ అని, అందరూ తలచుకుంటే కాంగ్రెస్ నేతలు తిరిగే పరిస్థితి ఉండదని, తమ పార్టీ కార్యాలయాలు, ఇండ్లపైకి వస్తామంటే భయపడే ప్రసక్తేలేదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రజల కోసమా.. పోలీసులకా?

- సమస్యలు చెప్పడానికి వస్తే అడ్డుకుంటారా?
- కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆసిఫాబాద్ టౌన్, జనవరి 22: 'కలెక్టరేట్ కార్యాలయం ప్రజల కోసమా.. పోలీసుల కోసమా ?' అని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రశ్నించారు. ప్రజా సమస్యలు కలెక్టర్‌ను కలిసి చెప్పుకోవడానికి వస్తే అడ్డుకోవడం ఏమిటని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం లొద్దిగూడ, కీమా నాయక్ తండా, చిన్న దాంపూర్ గ్రామ పంచాయతీలకు రోడ్డు సౌకర్యం, రైతుల భూములను ధరణిలో నమోదు చేయడం కోసం ఆయా గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌కు రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే ప్రజలతో కలిసి గేటు వద్దే ధర్నాకు దిగారు. ఎమ్మెల్యేనని చూడకుండా అడ్డుకొని పోలీసులు అగౌరవపరిచారని అసహనం వ్యక్తంచేశారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర రావు వచ్చి సముదాయించినా వినలేదు. దీంతో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ప్రజలు

ఆటోడ్రైవర్ దారుణ హత్య

పట్టపగలు హనుమకొండలో ఘటన

రాజ్‌కుమార్(ఫైల్)

సుబేదారి, జనవరి 22: ఆటో డ్రైవర్‌ను దారుణంగా హత్య చేసిన ఘటన హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని అదాలత్ జంక్షన్ సమీపంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండకు చెందిన ఆటోడ్రైవర్లు మాచర్ల రాజ్‌కుమార్(36), ఏనుగు వెంకటేశ్వర్లు ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాజ్‌కుమార్ ఇంటి నుంచి ఆటో నడుపుకోవడానికి హనుమకొండకు బయలుదేరగా వెంకటేశ్వర్లు గమనించి మడికొండ నుంచి ఆటోలో ఫాలో అయ్యాడు. అదాలత్ జంక్షన్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న క్రమంలో వెంకటేశ్వర్లు అడ్డగించాడు. దీంతో ఇద్దరూ ఆటోలు దిగి ఇద్దరూ గొడవపడ్డారు. వెంకటేశ్వర్లు పక్కా ప్లాన్‌తో వెంట తెచ్చుకున్న కత్తితో రాజ్‌కుమార్‌ను విచక్షణా రహితంగా కడుపులో పొడవడంతో అక్కడిక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత

- 9 జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు
- ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. రాష్ట్ర సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 6.9గా నమోదైంది. సంగారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 10 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో 14.5 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. సంగారెడ్డి జిల్లాలోని కోహిర్‌లో అత్యల్పంగా 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. 9 జిల్లాలకు ఆరెంజ్, 24 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌లను వాతావరణ శాఖ జారీచేసింది. రాబోయే 2 రోజులు ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణ రైతుల కోసమే కాళేశ్వరం

మొదటిపేజీ తరువాయి...

అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా వీ ప్రకాశ్ మాట్లాడుతూ..

మేడిగడ్డ వద్ద నిర్మాణం వెనుక అనేక కారణాలు

అంతర్రాష్ట్ర వివాదాల నేపథ్యంలో తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులను చేపట్టకుండా ఉమ్మడిరాష్ట్రం పక్కన పెట్టిందని ప్రకాశ్ వివరించారు. మరోవైపు ఎగువన మహారాష్ట్ర, ఇంకోవైపు కర్ణాటక తదితర రాష్ట్రాలు గోదావరిపై అనేక ప్రాజెక్టులను, బరాజ్‌లను నిర్మించి జలాలను మళ్లించుకుంటున్నాయని తెలిపారు. దీంతో తెలంగాణకు సంబంధించి ఎస్సారెస్పీ, సింగూరు, నిజాంసాగర్, కడెం, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల ఆయకట్టుకు సరిపడా నీరందని దుస్థితి నెలకొన్నదని వివరించారు. సాగునీరందక తెలంగాణ రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని, దీంతో పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి వాస్తవంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించాల్సి ఉందని అన్నారు. అయితే అప్పటికే గోదావరిలో తెలంగాణ నీటి అవసరాలు 200 టీఎంసీలకు పైగా డిమాండ్ ఉందని గుర్తుచేశారు. అయితే తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 165 టీఎంసీలు అందుబాటులో ఉండగా, అందులో ఎగువ

రాష్ట్రాల వాటా 63 టీఎంసీలు పోగా మిగిలింది 102 టీఎంసీలని తెలిపారు. అక్కడ బరాజ్ నిర్మించినా 44 టీఎంసీలకు మించి వినియోగించుకోలేమని వెల్లడించారు. ఇదే విషయాన్ని చెప్తూ వేరే ప్రత్యామ్నాయం చూసుకోవాలని తెలంగాణకు సీడబ్ల్యూసీ సూచించిందని గుర్తుచేశారు. అదీగాక తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి సాంకేతికంగా అనేక సమస్యలున్నాయని, పక్కన చాప్రాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉందని, అనుమతులు రావడం అసాధ్యమని తెలిపారు. ఇంకా ముంపు తదితర అనేక సమస్యల నేపథ్యంలోనే తెలంగాణ సర్కారు ప్రాజెక్టును రీడిజైన్ చేసిందని వివరించారు. హరీశ్‌రావు, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావుతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం 2016లో చేసిన సిఫారసుల ఆధారంగానే నీటిలభ్యత ఉన్న మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించి 18.25 లక్షల కొత్త ఆయకట్టుకు, వివిధ ప్రాజెక్టుల కింద నీరందని 18.75 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు నీరందించాలని నిర్ణయించిందని తెలిపారు. అదేవిధంగా తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన బరాజ్‌ను కూడా వార్ధా పైకి మార్చిందని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి 56 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందించాలని ప్రణాళిక సిద్ధం చేయగా, వార్ధాపై బరాజ్ నిర్మించడం ద్వారా రెండు లక్షల ఎకరాలకు నీరందించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని వివరించారు. గోదావరిలో తెలంగాణ నీటివాటా 968 టీఎంసీలని, ఆ మేరకు జలాలను వినియోగించుకోవాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు తప్ప మరో మార్గం లేదని వీ ప్రకాశ్ నొక్కిచెప్పారు. మేడిగడ్డ వద్ద బరాజ్‌ల నిర్మాణాన్ని విశ్రాంత ఇంజినీర్ల కమిటీ వ్యతిరేకించలేదని, పలుసార్లు సమర్థించారని గుర్తుచేశారు. బొగ్గు గనుల ప్రాంతంలో సొరంగాలు నిర్మించవద్దన్న విశ్రాంత ఇంజినీర్ల సిఫారసులను బీఆర్ఎస్ ప్రభుత్వం గౌరవించిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించాల్సిందేనని, అందుకు అనేక అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. అటు తరువాత కమిషన్ విచారణ రేపటికి వాయిదా పడింది. గురువారం పలు నిర్మాణ సంస్థల బాధ్యులను విచారించనున్నట్టు సమాచారం.

కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం..

కమిషన్ విచారణ అనంతరం వీ ప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. కమిషన్ ఎదుట నివేదించిన వివరాలను ఈ సందర్భంగా వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర జలశక్తిశాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, ఎమ్మెల్సీ కోదండరాం, ఎల్క్ట్రిసిటీ ఇంజినీర్ రఘు పేర్లను ఉదహరించారు. నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ వెల్లడించినా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కరెంటు ఖర్చులపై కూడా దుష్ప్రచారం చేశారని విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులోనూ లిఫ్టులు ఉన్నాయని తెలిపారు. విశ్రాంత ఇంజినీర్ల రిపోర్టును కూడా కాంగ్రెస్ తోపాటు, ఆ ముగ్గురు పెద్దమనుషులు పక్కదోవ పట్టించారని మండిపడ్డారు. మూడో టీఎంసీ ఎందుకనేది నీళ్లపై అవగాహన ఉన్నవాళ్లకే అర్థమవుతుందని వీ ప్రకాశ్ తెలిపారు. తెలంగాణ వాటా జలాలు 968 టీఎంసీలను వినియోగించుకోవాల్సి ఉంటుందని, లేదంటే జలహక్కులను కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. తుదకు విచారణ కమిషన్‌కు సైతం గతంలోని అబద్ధపు ప్రచారాలనే నివేదించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కమిషన్ ఎదుటకు వచ్చి వాస్తవాలను వివరించానని తెలిపారు.

శ్రీశైలం ఆశలు ఆవిరి!

మొదటిపేజీ తరువాయి...

కదుపుతున్నది. వెరసి శ్రీశైలం ప్రాజెక్టు తెలంగాణ చేజారిపోయే ప్రమాదం పొంచి ఉన్నదని రాష్ట్ర ఇంజినీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జలవిద్యుత్తు ప్రాజెక్టుగా శ్రీశైలం డ్యామ్ మార్పు

1953లో మద్రాస్ ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్టును ఇరిగేషన్ ప్రాజెక్టుగా ప్రతిపాదించినప్పటికీ, ఆ తరువాత జలవిద్యుత్తు ప్రాజెక్టుగా మార్చారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వమే ఆ మేరకు 1959లో ప్లానింగ్ కమిషన్‌కు, విద్యుత్తు సంస్థకు నివేదించగా, అటు తరువాత అనేక షరతులతో 1963లో ఆమోదం లభించింది. 1969లో ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్‌కు సైతం శ్రీశైలం కేవలం జలవిద్యుత్తు ప్రాజెక్టేనంటూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రిపోర్టు ఇచ్చింది. దీంతో శ్రీశైలం డ్యామ్‌ను కేవలం విద్యుత్తు ఉత్పాదక ప్రాజెక్టుగానే బచావత్ ట్రిబ్యునల్ పరిగణించింది. ప్రాజెక్టులోని నీటిని విద్యుత్తు ఉత్పత్తి కోసమే తప్ప ఇతర అవసరాలకు విడుదల చేయవద్దని తెలిపింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టును సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కలుపుకుని 405 టీఎంసీల భారీ సామర్థ్యంతో చేపట్టారు. అందులో భాగంగా సాగర్ ప్రాజెక్టు అవసరాలను తీర్చేందుకు సరిపడే నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా శ్రీశైలం రిజర్వాయర్‌ను నిర్మించారని, శ్రీశైలం నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ, 280 టీఎంసీలను సాగర్‌కు విడుదల చేయాల్సి ఉన్నదని తెలంగాణ స్పష్టం చేసింది. కానీ ప్రస్తుతం జలవిద్యుత్తు ప్రాజెక్టు నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం పైనే ఆంక్షలు పెట్టే దుస్థితి నెలకొన్నది.

ఎండీడీఎల్ మార్పు వెనక మర్మమిదే

శ్రీశైలం డ్యామ్ నుంచి జలవిద్యుత్తు ఉత్పత్తికి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేవు. ప్రాజెక్టు వాస్తవ ఎండీడీఎల్ 834 అడుగులు. ఆ మేరకు జలవిద్యుత్తును ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉన్నది. ఒకదశలో శ్రీశైలం ప్రాజెక్టులో 760 అడుగుల వరకూ నీటిని విడుదల చేయవచ్చని 2013లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ, ప్రస్తుతం ఆ ఎండీడీఎల్‌ను ఏకంగా 854 అడుగులకు నిర్ణయించేందుకు ఏపీ పట్టుబడుతున్నది. చెన్నై నగరానికి తాగునీటిని సరఫరా చేసేందుకు వీలుగా శ్రీశైలం రిజర్వాయర్‌లో 854 ఎండీడీఎల్ మెయింటెన్ చేయాలని డిమాండ్ చేస్తున్నది. ఆవిరి నష్టాల కింద శ్రీశైలం ప్రాజెక్టుకు 33 టీఎంసీల నీటిని కేటాయించాలంటూ ఏపీ చేసిన విజ్ఞప్తి ట్రిబ్యునల్ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఏపీ మరో ఎత్తు వేసింది. చెన్నై తాగునీటి అంశాన్ని ఆసరాగా చేసుకుని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ఏర్పాటుకు పూనుకున్నది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు 874 ఎత్తు వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీని ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఆ తరువాత చెన్నై తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు, శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్ఆర్‌బీసీ)కి 19 టీఎంసీలు మొత్తంగా 34 టీఎంసీలను తరలించేందుకు 854 అడుగుల వద్ద పోతిరెడ్డిపాడు నుంచి జలాలను తరలించేలా ఏర్పాటుచేసింది. అక్కడితో ఆగకుండా హెడ్‌రెగ్యులేటరీని విస్తరించుకుంటూ ఏటా బేసిన్ అవతలికి కృష్ణా జలాలను అక్రమంగా మళ్లిస్తున్నది. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఎక్కువ మొత్తంలో తరలించాలంటే ప్రాజెక్టు ఎండీడీఎల్ 854 అడుగులు ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ఎండీడీఎల్ మార్పునకు ఏపీ పట్టుబడుతున్నది. ఆ మేరకు కేంద్రానికి, కేఆర్ఎంబీకి అనేకసార్లు లేఖలు రాసింది. కేంద్రం సైతం గతంలో శ్రీశైలం ఎండీడీఎల్‌ను 854గా నిర్ధారిస్తూ ప్రాజెక్టు రూల్‌కర్వ్‌ను రూపొందించింది. రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఈ అంశంపై చర్చకు పెట్టింది. కానీ, అది ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఎత్తుగడలను గమనించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో-34 విడుదల చేసింది. 834 అడుగుల వరకు పూర్తి సామర్థ్యం మేరకు విద్యుత్తు ఉత్పత్తి చేయాలని అందులో పేర్కొన్నది. ఆ జీవోను కొట్టేయాలని కోరుతూ ఏపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మరోవైపు ప్రస్తుతం ఎండీడీఎల్ మార్పునకు గుట్టుగా పావులు కదుపుతున్నదని ఇంజినీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణకు తీరని నష్టం

ఇప్పటికే పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణాజలాలను ఇష్టారాజ్యంగా తరలించడం వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లుతున్నది. ప్రస్తుతం ఎండీడీఎల్‌ను మార్చినా అంతే నష్టం తప్పదని ఇంజినీర్లు, నీటిరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఎత్తిపోతల ద్వారానే తెలంగాణ ప్రాంతానికి నీటిని అందించాల్సి ఉంటుంది. అందుకు విద్యుత్తు అత్యవసరం. జలవిద్యుత్తు అత్యంత చౌకగా లభిస్తుంది. శ్రీశైలంలో నీరు నిల్వ ఉంటే నిరంతరాయం విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే అవకాశముంటుంది. కానీ, ఎండీడీఎల్‌ను 854 అడుగులకే నిర్ణయిస్తే ఆ మేరకు జలాలు ఉన్నప్పుడు మాత్రమే విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సి వస్తుందని చెప్తున్నారు. అది తెలంగాణ సాగునీటి, తాగునీటి అవసరాల విద్యుత్తు డిమాండ్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వరద నియంత్రణకు అంతర్రాష్ట్ర కమిటీ

- గేట్ ఆపరేషన్ ప్రోటోకాల్‌పై అధ్యయనం
- డ్యామ్ సేఫ్టీ స్టేట్ కమిటీ మీటింగ్‌లోరాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో వరద నియంత్రణ, ముంపు నివారణ కోసం సంబంధిత అన్ని రాష్ట్రాలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆయా బేసిన్ల లోని ప్రాజెక్టుల వారీగా గేట్ ఆపరేషన్ ప్రోటోకాల్‌పై అధ్యయనం జరిపించాలని తెలంగాణ ఇరిగేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్ ప్రతిపాదించారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌లో భాగమైన డ్యామ్ సేఫ్టీ స్టేట్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. హైబ్రిడ్ విధానంలో కొనసాగిన ఈ సమావేశంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఉన్నతాధికారులు, ఇద్దరు ఓయూ ప్రొఫెసర్లు, సీడబ్ల్యూసీ మెంబర్ కన్వీనర్ పాల్గొన్నారు. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం గత ఏడాదిగా చేపట్టిన చర్యలను ఆయా రాష్ట్రాలు వివరించాయి. ఈ సందర్భంగా కమిటీ ఎదుట తెలంగాణ ఇరిగేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్ పలు ప్రతిపాదనలు పెట్టారు. విజయవాడ ముంపు లాంటి విపత్తులు భవిష్యత్‌లో తలెత్తకుండా చూసేందుకు కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులను సమన్వయం చేయాలని, వాటిని ఆపరేట్ చేసేందుకు 4 రాష్ట్రాల సీఈలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన వరద ప్రవాహాల తీరుతెన్నులపై ఐఐటీ హైదరాబాద్ లేదా ఐఐటీ రూర